


సంచిక : 3 'వాసన్' నెట్‌వర్క్ త్రైమాసిక పత్రిక జులై - సెప్టెంబర్ 2007

# దేశంలోని వర్షాధార ప్రాంతాలకు సమగ్ర వాటర్‌షెడ్ విధానం

వర్షాధార ప్రాంతాలలో పేదరికాన్ని ఎదుర్కోడానికి వాటర్‌షెడ్ విధానం సరయినదని అందరూ ఏకీభవిస్తారు. గ్రామీణాభివృద్ధి పై ప్రణాళికా సంఘం తీసుకురానున్న పుస్తకంలో ఒక అధ్యాయం దీని కోసం ప్రత్యేకంగా కేటాయించారు. దీని ముసాయిదా ప్రతిలోని కొన్ని అంశాలను ఇక్కడ పొందుపరుస్తున్నాం.

గ్రామీణ ప్రాంతాలలో పేదరికం, చదువు లేకపోవటం, ఆరోగ్యం లేకపోవటం, వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండటం, దిక్కుతోచక వలస పోవటం, ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటం వంటి సమస్యలు ఉన్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ శాఖలు సరైన శ్రద్ధ చూపకపోవటం, సేవలు తగిన విధంగా ఉండకపోవటంతో పాటు సామాజికంగా అసమానతలు, దోపిడీ వంటి అంశాలు కూడా ఉన్నాయి. వర్షాధార ప్రాంతాలలో పైన తెలిపిన అనేక సమస్యలను వాటర్‌షెడ్ విధానం పరిష్కరించగలదు. అందుకే దీని వ్యవస్థాగత ఏర్పాట్లను బలపరిచి, ప్రాజెక్టులో చేపట్టే అంశాలను మెరుగు పరిచి, బడ్జెటును పెంచే ఆలోచనతో ప్రభుత్వం ఉంది.

ఇప్పటికే దేశంలో అమలు పరిచిన వాటర్‌షెడ్ల నుంచి అనుభవాలను తీసుకుని, వాటి బలాలు బలహీనతలను అర్థం చేసుకుని ముందుకు వెళ్ళే యోచన చేస్తున్నారు. అదేవిధంగా సహజ వనరుల యాజమాన్యంలో భాగస్వామ్యానికి సూత్రాలను గుర్తించారు. ఇవి ప్రజా ఆధారిత సంఘాల కీలక పాత్ర, సమానత (ఈక్విటి), వికేంద్రీకరణ, ఫెసిలిటేటింగ్ సంస్థల ప్రాముఖ్యత, పర్యవేక్షణ & అంచనాలు, నేర్చుకోవటం, సామర్థ్యం పెంపుదల & సాఫ్ట్‌వేర్ మద్దతు, అభివృద్ధి, ప్రగతికి నిరంతర ప్రేరణ, వ్యవస్థాగత పునః నిర్మాణం. దేశంలోని మొత్తం వర్షాధార భూముల్ని గుర్తించటమే కాకుండా 11వ పంచవర్ష ప్రణాళికలో భాగంగా అభివృద్ధికి చేపట్టనున్న అర్హమైన భూములను గుర్తించి, వాటికి తగినన్ని నిధులు కేటాయించనున్నది. 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో సమగ్ర వాటర్‌షెడ్ అభివృద్ధి కింద 36.6 మిలియన్ హెక్టార్లు చేపట్టవచ్చని అంచనా.

*- యం. వి. రామచంద్రుడు, వాసన్*

## వార్షిక నెట్‌వర్క్ సమావేశం (ఎఎన్‌ఎం 2007) జులై 24, 25 తారీకులలో . . .

ప్రతి సంవత్సరం జరిగే వాసన్ వార్షిక నెట్‌వర్క్ సమావేశం 2007 (ఎఎన్‌ఎం - 2007) ఈ సంవత్సరం జులై 24, 25 తారీకులలో హైదరాబాదులో జరుగుతుంది. ఎఎన్‌ఎం సమావేశంలో సహజ వనరులపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రముఖమైన అంశాలను చర్చించి అవసరమైన మార్పుల కోసం ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకు వస్తారు. ఈ సంవత్సరం ప్రధాన చర్చనీయాంశంగా 'అభివృద్ధి పథకాలు - ప్రజల ద్వారా అంచనా'ని ఎన్నుకున్నారు. ఇందులో వాటర్‌షెడ్లు, ఇందిర ప్రభ, ఉపాధిహామీ పథకంతో పాటు భాగస్వామ్య సాగునీటి యాజమాన్యం, నీరు, పారిశుద్ధ్యం వంటి వాటిని చర్చిస్తారు.

అంతేకాకుండా భూమి అభివృద్ధి పథకాలు, జాతీయ ఉపాధి హామీ పథకం మధ్య సమన్వయం, వాటర్‌షెడ్ కార్యక్రమాలలో రూపుదిద్దుకుంటున్న స్వచ్ఛంద సంస్థల పాత్ర వంటి అంశాలను చర్చిస్తారు. ఈ అంశాలపై మీ అభిప్రాయాలను, మీ సూచనలు, సలహాలను wassan@eth.net కి గాని లేదా ఉత్తరం రాసి గానీ తెలియ చెయ్యండి. పుస్తకావిష్కరణలు, ప్రదర్శన ఉంటాయి కాబట్టి మీ పుస్తకాలు, ప్రదర్శనలతో రండి. మీకు కావలసిన ఏర్పాట్ల గురించి రాయండి.



# కరువు కవచం - అనుభవాలు

వ్యవసాయ ప్రధానమైన మన దేశంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయితే ఈనాటికీ ఎంతో మంది జీవితాలు అతలాకుతలం అయిపోతున్నాయి. మన రాష్ట్రంలోని వర్షాభావ జిల్లాలైన అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, ప్రకాశం జిల్లాలు ఇటువంటి విపరీత పరిణామాలను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘంతో కలిసి ప్రపంచబ్యాంకు సహాయంతో కరువు కవచం అనే పథకాన్ని చేపట్టింది.



మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు మండలాల్లోని 15 గ్రామాలలో పైలట్ కార్యక్రమం చేపట్టారు. ముందుగా గ్రామ ప్రజల్నే కాకుండా, స్థానిక పరిస్థితులను, రైతుల స్థితిగతులను తెలుసుకుని పైలట్ కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వంతో కలిసి పని చేయడం, కన్వర్జెన్స్‌ను కూడా దృష్టిలో పెట్టుకున్నారు. వ్యవసాయ విధానాల ఆధారంగా ఏంచేయాలో నిర్ణయించటం, వ్యవసాయ వైవిధ్యీకరణ, భూసార పెంపుదల, శ్రీ పద్ధతిలో సాగు, గొర్రెల జాతి మెరుగుపరచడం, ఒంటరి, పేద స్త్రీలకు జీవనోపాధుల కల్పన, భూగర్భ జలాలను సమష్టిగా వాడుకోవటం, ఉమ్మడి భూముల పునరుద్ధరణ వంటివి ఉన్నాయి. దీంట్లోని గుణ పాఠాలను రెండవ దశలోకి తీసుకెళుతున్నారు. ఉదాహరణకి మండల మహిళా సమాఖ్య, గ్రామ సంఘాలు పటిష్టంగా ఉన్న గ్రామాలను ఎంపిక చేస్తారు. అలాగే చేపట్టబోయే పనులలో పరిశోధన & అభివృద్ధి (ఆర్డ్ఇ) అంశాలను చేరుస్తారు. చేపట్టబోయే పనులను పైలెటింగ్, ప్యాకేజింగ్, అప్ స్కేలింగ్ అన్న మూడు దశలలో చేపడతారు.



అప్పటివరకు జరిగిన కార్యక్రమాన్ని అంచనా వేసి, భవిష్యత్తు ప్రణాళికలను చర్చించటానికి ప్రపంచ బ్యాంకు బృందం ఏప్రిల్ నెలలో వచ్చి ప్రభుత్వ అధికారులు, వాసన్‌తో చర్చలతో పాటు క్షేత్ర సందర్శనలు చేసింది. కార్యక్రమం అమలు తీరుపట్ల బృందం తన సంతృప్తిని వ్యక్తపరిచింది. కంపోస్టింగ్ ద్వారా భూసారం పెంచటంలో అనేక పనులను ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేయవచ్చని గుర్తించారు. అయితే ఈ కొత్త పనులకు ఆమోదం పొంది వాటిని పనుల జాబితాలోకి చేర్పించటానికి అనుకున్న దానికంటే ఎక్కువ సమయమే పడుతోంది. అంతేకాకుండా ఒక అంశం మీద కేంద్రీకరిస్తున్నప్పుడు కూడా (ఉదా: భూగర్భ జలాలను పంచుకోవటం) వాస్తవానికి ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాల సమూహమని గుర్తించారు.



రెండవ దశ కార్యక్రమం జులై 2007లో మొదలు కాబోతుంది. దాని కింద మహబూబ్‌నగర్‌లో మరో 9 గ్రామాలను అనంతపురంలో 10 పైలట్ గ్రామాలను చేపట్టనున్నారు. దీనికి జపాను పిహెచ్ఆర్‌డి క్లైమేట్ ఛేంజ్ ఇనిషియేటివ్ గ్రాంట్ కింద నిధులు అంద చేస్తున్నారు.

- ***యం. చంద్రశేఖర్***, వాసన్

## జనాదేశ్ - 2007

ప్రజలే పాలకులయిన ప్రజాస్వామ్యంలో వారి ఆదేశాల ప్రకారం, తీర్పుల ప్రకారం పనులు జరుగుతున్న దాఖలాలు ఏమీలేవు. ఓటు వెయ్యడంతో ప్రజల అధికారమంతా ప్రజా ప్రతినిధుల చేతుల్లోకి వెళ్ళిపోతున్న నేపథ్యంలో ప్రజల సాధికారీకరణకు అహింసాయుత, సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో నిర్మించాల్సిన అవసరం ఉంది. ఆ దశలో మొదటి అడుగు “జనాదేశ్ (ప్రజా తీర్పు) 2007”.

“జనాదేశ్ - 2007”కి ఏక్తా పరిషత్ సంధాన కర్తగా వ్యవహరిస్తోంది. గాంధేయ సిద్ధాంతాలతో, అహింసాత్మక చర్యలతో ఏక్తా పరిషత్ పనిచేస్తోంది. జీవనోపాధి వనరులైన భూమి, నీరు, అడవులపై ప్రజలు నియంత్రణ సాధించటంలో సహాయ పడటం ఏక్తా పరిషత్ ఉద్దేశం.

### జనాదేశ్ 2007 డిమాండ్లు:

- ☆ అన్ని రాజకీయ పార్టీల మానిఫెస్టోలలో భూ సంస్కరణల అంశం ఉండాలి
- ☆ జాతీయ భూ ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలి
- ☆ ప్రజలకు భూమి హక్కు కల్పించేలా భూ పంపకం విధానాన్ని అమలు చెయ్యాలి
- ☆ భూమి పట్టా ఉన్న వాళ్ళందరికీ భూమిని చూపించాలి
- ☆ గిరిజనులను అడవుల నుంచి నిర్వాసితులను చెయ్యటం వెంటనే ఆపివెయ్యాలి
- ☆ భూమి, నీరు, అడవులతో సహా జీవనోపాధి వనరులను న్యాయబద్ధంగా పంపిణీ చెయ్యాలి

ఈ దిశగా వివిధ ప్రాంతాలలో జరిగే వివిధ కార్యక్రమాలు అక్టోబరు 2007 నాటికి పతాక స్థాయికి చేరుకుంటాయి. గాంధీ జయంతి అయిన అక్టోబరు 2న గ్వాలియర్ నుంచి 25,000 మంది ఢిల్లీకి పాదయాత్ర చేపడతారు. ఈ పాదయాత్ర 350 కిలోమీటర్లు ఉంటుంది. ఢిల్లీకి మొత్తం లక్షమంది ప్రదర్శకులు చేరుకుంటారు.

ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టవలసిన కార్యక్రమాలను నిర్ణయించటానికి జూన్ ఆఖరి వారంలో ఒక సమావేశం జరుగుతుంది. మరిన్ని వివరాలకు చూడండి: www.ektaparishad.org

*- సిహెచ్ రవికుమార్, 94412 31034*




## వాటర్ పోర్టల్

ప్రజలతోటి, అమలు చేస్తున్న వారితోటి నీటికి సంబంధించిన జ్ఞానాన్ని, యాజమాన్యాన్ని పంచుకోటానికి వాటర్ పోర్టల్ ఏర్పడింది. దీని చిరునామా www.indiawaterportal.org/arghyam/

నీటి రంగంలోని నిపుణుల అపార అనుభవాలను అందిపుచ్చుకుని ఇంటర్నెట్ ద్వారా విస్తృతంగా అందించే ఏర్పాట్లను ఇది చేస్తుంది. అర్ఘ్యం అన్న సంస్థ ఫిబ్రవరి 2005లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇటువంటి అవసరాన్ని గుర్తించడంతో వాటర్ పోర్టల్ రూపుదిద్దుకుంది. నీటి రంగంలో పని చేస్తున్న ‘అర్ఘ్యం’ ఈ పోర్టల్‌కు సంయోజనకర్తగా వ్యవహరిస్తోంది. ‘అర్ఘ్యం’ గురించి మరిన్ని వివరాలకు చూడండి www.arghyam.org

నీటి రంగంలో సుస్థిరత, సమానత సాధించటం వాటర్ పోర్టల్ యొక్క అంతిమ లక్ష్యం. జ్ఞానం కొంతమంది దగ్గరే పోగు పడటం కూడా నీటి వనరుల సుస్థిర యాజమాన్యం సాధించలేకపోటానికి ఒక కారణం. ప్రజలలో చైతన్యం పెంచటం, నీటికి సంబంధించిన సమాచారం, గణాంకాలలో పారదర్శకత సాధించటం, సుస్థిర విధానాలను ప్రచారం చెయ్యటం, మంచి అనుభవాలను పంచుకోవటం వాటర్ పోర్టల్ ఉద్దేశం.

నీటిరంగ నిపుణులు, పరిశోధనా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు, చరిత్రకారులు, భూగర్భ శాస్త్రవేత్తలు, ఐటి నిపుణులు, విద్యావేత్తలు వాటర్ పోర్టల్‌లో భాగస్వాములుగా ఉన్నారు. మరింత మందిని భాగస్వాముల్ని చేసి పరిధిని విస్తృతం చెయ్యాలన్న ఉద్దేశంతో వాటర్ పోర్టల్ ఉంది. దీంట్లో ఆసక్తి ఉన్న వారు సంప్రదించండి: Arghyam, 840, 5th Mavo, 2nd floor, Indira nagar, 1st stage, Bangalore 560 038. E-mail; portal@arghyam.org

# మన నీటి భవిష్యత్తు

ప్రపంచంపై జీవం మనుగడకు ముఖ్యమైన వాటిల్లో నీరు ఒకటి. ఈ విలువైన ప్రకృతి సంపద ఒకప్పుడు దండిగా ఉండేది. పెరుగుతున్న డిమాండు, కరువు పీడిత ప్రాంతాల్లో విస్తరిస్తున్న ఎడారులు, సాగునీటిని అధికంగా వాడటం, పరిమితులకు మించి ఉపయోగించుకోవటం వంటి కారణాల వల్ల ఈ జీవ జలానికి కొరత ఏర్పడే పరిస్థితిలో ఉన్నాం. నీటి సంరక్షణ, సమ పంపిణీ సాధించాలంటే సమర్థమైన చట్టాలు, ప్రస్తుతమున్న చట్టాలు/ నియంత్రణలను అమలులో పెట్టడం, వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ వంటి కొన్ని అంశాలను పరిష్కరించాలి. దీనికి సామూహిక చర్య, వివిధ పాత్రధారుల మధ్య నెట్‌వర్కింగ్ అవసరం.




ఈ నేపథ్యంలో సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ (సిడబ్ల్యుఎస్), ఇఇడిలు అక్టోబరు 2006లో ఇక్రిసాట్‌లో వివిధ అంశాలపై చర్చించి, అనుభవాలను పంచుకుని, కలిసి చేపట్టే పనిని రూపొందించటానికి మూడు రోజుల వర్క్‌షాపు నిర్వహించాయి. దీని నివేదిక Water and Democracy పేరుతో ఇటీవల విడుదలయ్యింది. దీని ప్రతి కోసం సిడబ్ల్యుఎస్‌కి రాయండి.

వర్క్‌షాపుకి ఫాలో-అప్‌గా వివిధ దేశాల నుంచి 10 మంది సభ్యులతో స్టీరింగ్ కమిటీ ఏర్పడింది. కార్యాచరణ ప్రణాళికకు తుది రూపాన్ని ఇవ్వటంలోనూ, దీనిని అమలు చేయడంలో నోడల్ పాయింట్లుగా వ్యవహరించడంలోనూ వీళ్ళు బాధ్యత వహిస్తారు. ప్రస్తుతం అమలులో ఉన్న నీటి యాజమాన్య విధానాలను సభ్యులు పరిశీలిస్తారు. దీని తరువాత ప్రచార ఉద్యమాలు నిర్వహిస్తారు, నీటిని ప్రైవేటు పరం చేసి, సరుకుగా మార్చటం పట్ల ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యటానికి ప్రచార ఉద్యమాలు ఉపయోగపడతాయి. స్థానిక వనరులపై తమ హక్కుల్ని చాటుకుని, నీటిని సుస్థిర పద్ధతుల్లో నిర్వహించుకునే విధంగా ప్రజల సామర్థ్యం పెంచటం దీని ఉద్దేశం. ప్రస్తుత విధానాలను మార్చేలా అడ్వకసీ చర్యలు కూడా చేపడతారు. ఈ అంశాలపై రెండు సంవత్సరాల పాటు ముందుగా కృషి చేస్తారు.

*- సి.ఉదయ శంకర్, అడ్వైజర్, సిడబ్ల్యుఎస్*

# సర్కారు తుమ్మ - సమస్యా? సమాధానమా?

మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తూరు ఒక మారుమూల గ్రామం. ఈ ఊరిలో ఒకప్పుడు చెరువు నిండా నీళ్ళు ఉండి సంవత్సరమంతా కళకళలాడుతుండేది. నీటి కోసం కొంగలు, ఇతర నీటి పక్షులు అధిక సంఖ్యలో వచ్చి చేరటంతో ఈ ఊరికి కొంగల కొత్తూరు అని పేరు కూడా ఉండేది. కొంగల సంఖ్య తగ్గిపోతే ఆ సంవత్సరం వర్షపాతం సరిగా ఉండదని ప్రజల నమ్మకం.



చెరువు నీటితో వరిపంట పండిస్తూ పచ్చగా వర్ధిల్లిన ఊరు ఒకప్పటి కథ అయ్యింది. వాతావరణంలోని మార్పు వల్ల గత యాభై సంవత్సరాలలో వార్షిక వర్షపాతం 800 మి.మీ. నుంచి 600 మి.మీ.లకు పడిపోయింది. దాంతో చెరువు నీటితో వరిసాగు విస్తీర్ణం తగ్గసాగింది. ఉన్న కొద్ది భూగర్భ జలాలను తోడేసి వరి పండించటం మొదలు పెట్టారు. వరి పండించలేక చాలావరకు భూములు పడావుగా వదిలేశారు. అదీకాక భూములు చవుడు బారాయి.

ఈ పరిస్థితులలో సర్కారు తుమ్మ (ప్రోసోపిస్ జ్యులీఫ్లోరా) చెట్లు విపరీతంగా పెరగసాగాయి. 30 సంవత్సరాల క్రితం ఊరిలో లేని ఈ చెట్టు ఇప్పుడు పడావు, బహిరంగ భూముల్లో 30 శాతాన్ని ఆక్రమించింది. ఏ ఉపయోగమూ లేని ఈ చెట్టుని

మిగతా 8వ పేజీలో

# పురుగు మందులిక బలాదూర్

ఇటీవలే సుస్థిర వ్యవసాయ కేంద్రం, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్తంగా రైతులకు మూడు పుస్తకాలను విడుదల చేశాయి. అవి పత్తి, మిరప, స్థానిక వనరులతో సుస్థిర సేద్యం.

పురుగు మందులు విడనాడి తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన పర్యావరణం, ఆహారం పొందటానికి రైతులకు ఇవి ఎంతగానో దోహదం చేస్తాయి.






**1. పత్తి (సుస్థిర వ్యవసాయ పద్ధతులు):** ఈ పుస్తకంలో పత్తిసాగులో అధిక ఖర్చుకు కారణాలు, విత్తనాలలో రకాలు, హైబ్రిడ్‌లు, పత్తి పంటకు కావలసిన పోషకాలు, నేల, నీటి యాజమాన్యం, పత్తి పంటలో వచ్చే పురుగులు, పురుగు మందులతో వచ్చే సమస్యలు, స్థానికంగా లభించే వనరులతో పురుగులను నివారించే మార్గాలు, రైతు మిత్ర పురుగులు, పత్తిని ఆశించే ముఖ్యమైన తెగుళ్ళు, తెగుళ్ళ నివారణకు మార్గాలు వివరించారు. అంతేకాకుండా పత్తిని ఏరటంలో పాటించాల్సిన మెలకువలను గురించి కూడా వివరించారు.




**2. మిరప (సుస్థిర వ్యవసాయ పద్ధతులు):** ఆంధ్రప్రదేశ్‌లో మిరప ముఖ్యమైన వాణిజ్య పంట. ప్రతి ఏటా ఆరు నుండి ఏడు లక్షల ఎకరాలలో సాగు చేస్తున్నారు. నాలుగు లక్షల టన్నుల దిగుబడిని పొందుతున్నారు. నాణ్యమైన మిరప పండించటం కోసం ఏ విధమైన రసాయనిక పురుగు మందులు వాడకుండా మిరప సాగు పద్ధతులను గురించి ఈ పుస్తకంలో వివరించారు. దీనిలో భాగంగా ముఖ్యమైన మిరప రకాలు, నారుమడి యాజమాన్యం, భూసార యాజమాన్యం, మిరప పంటలో వచ్చే ముఖ్యమైన పురుగులు, తెగుళ్ళు వాటి యాజమాన్య పద్ధతులు, మిరప కోత సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అంతేకాకుండా మిరప పంటలో అఫ్లోటాక్సిన్‌ల ప్రాముఖ్యత, యాజమాన్యం గురించి వివరించారు.




**3. స్థానిక వనరులతో సుస్థిర సేద్యం (సేంద్రియ ఎరువులు, ద్రావణాలు, కషాయాలు):** రసాయనిక ఎరువులు, పురుగు మందులతో ఉన్న సమస్యలు గుర్తించిన రైతులు స్థానిక వనరులను వాడుకునే పద్ధతుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాలలో అందుబాటులో ఉండే వనరులను వాడుకునే పద్ధతులు అన్నీ ఒకచోట పొందుపర్చటానికి ఒక చిన్న ప్రయత్నం ఈ పుస్తకంలో జరిగింది. ఇందులో పేర్కొన్న పద్ధతులన్నీ రైతులు గత కొన్ని సంవత్సరాలుగా వాడుతున్నవే. ఇందులో భూసార యాజమాన్య పద్ధతులు (సుమారు 20 పద్ధతులు), పురుగులు నివారణలో ఉపయోగించే వివిధ వృక్ష సంబంధమైన కషాయాలు, ద్రావణాలు (సుమారు 13), తెగుళ్ళ నివారణలో ఉపయోగించే వివిధ పద్ధతులు (సుమారు 27) గురించి వివరించారు. అంతేకాకుండా అనేక ఇతర సేంద్రియ పద్ధతుల (22 వరకు) వివరించారు. సమగ్ర సస్యరక్షణలో వృక్ష రసాయనాల ప్రాధాన్యత, వీటి తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు మొదలైన అంశాల గురించి వివరంగా ఈ పుస్తకంలో ఉంది. మరిన్ని వివరాలకు సంప్రదించండి.

*- డా॥ రఘునాథ్, సుస్థిర వ్యవసాయ కేంద్రం*

*12-13-440, వీధి. నెం.1, తార్నాక, సికింద్రాబాదు*



# గోబర్ పరోబ్

## అరకు గిరిజనుల ఎరువు పండగ















విశాఖ జిల్లా అరకు లోయ ప్రాంతంలో డుమ్రిగూడ మండలంలోని కొన్ని గిరిజన గూడెంలలో ఇప్పుడు అంతా ఆ పండగ సందడే.. ఆడా, మగా, చిన్నా, పెద్దా తేడా లేదు.. అందరి నోటా ఆ మాటే... ఒక్కో రోజు ఒక్కో గూడెం ఆ పండగ చేసుకుంటోంది. నిజానికి ఇప్పుడు వాళ్లు చేసుకుంటున్నది ఒక కొత్త పండగ... ఆ పండగ పేరు 'గోబర్ పరోబ్'. గిరిజనుల స్థానిక భాషలో 'గోబర్' అంటే ఎరువు అని, 'పరోబ్' అంటే పండగ అని అర్థం.

'ఏడాదికి మాకున్నవి పది పండగలు.. మా ఆచారాలు, పంట కాలం బట్టి ఈ పండగలు చేసుకుంటం... ఈ ఏడాది ఇంకో కొత్త పండగ చేసుకుంటున్నాం... మాకింత తిండి పెట్టే ఈ భూమికి బలం ఇచ్చే గెత్తం కోసం చేసుకుంటున్న పండగ ఇది... మిగతా పండగలు సరదాకు, సంతోషానికి చేసుకునేవి... ఈ గెత్తం పండగ మాత్రం మా భూమి కోసం, మా బతుకు కోసం చేసుకుంటున్న పండగ...' అంటున్న అక్కడి గిరిజనుల మాటల్లో ఈ కొత్త పండగ పట్ల వారికి ఉన్న అభిప్రాయం ఏమిటో స్పష్టంగానే తెలుస్తోంది. ఏదైనా మంచి జరిగినా, మంచి జరగాలని కోరుకున్నా ఆ గిరిజనులు చేసుకునేది ఇలాంటి పండగలే.. వారి ఆచార వ్యవహారాలు, జీవన విధానాల్లో ఇవి అంతర్భాగాలు..

### పొద్దంతా గెత్తం కోసం...

పక్కనున్న పచ్చని కొండ గుట్టలు, అడవి నుంచి రకరకాల చెట్ల ఆకులు, లేత కొమ్మలు తీసుకొచ్చి తమ పొలంలో తీసిన గొయ్యిలో పోసి వాటి నుంచి ఎరువు తయారుచేసుకోవడం అన్నది ఈ పండగలో ప్రధానమైన అంశం. అడవి చెట్ల ఆకులతో తయారైన ఈ ఎరువు తమకున్న కొద్దిపాటి భూములుకు కావలసిన జవం ఇస్తుందని వారు ఆశ పడుతున్నారు... అదే ఆశతో గూడెంలోని ప్రతి కుటుంబం కనీసం ఒక ఎరువు గొయ్యి తయారు చేసుకుంటోంది.

### సాయంత్రం.. సాంప్రదాయ నృత్యం

పండగ రోజు సాయంత్రం లోగా ఎవరికి వారు తమ భూముల్లో ఆకులు, అలములతో గొయ్యి నింపే పనంతా పూర్తి చేస్తారు. పొద్దుగూకేసరికి గూడెంకు తిరిగొస్తారు. ఈ లోగా గూడెంలోని కొంతమంది ఊళ్లోని వారందరికి సరిపొయ్యేలా వంట సిద్ధం చేస్తారు. రాత్రి 7 నుంచి 8 గంటల లోపు అందరూ కలిసి భోజనం చేస్తారు. ఒకరి వెంట ఒకరు ఆడవాళ్లంతా ఆట పాటల్లోకి దిగుతారు, మగవాళ్లు, పిల్లలు చుట్టూ చేరి ఉత్సాహపరుస్తుంటే మెల్లమెల్లగా

వాళ్ల సాంప్రదాయ 'ధింసా' నృత్యం పతాక స్థాయిని అందుకుంటుంది. అలుపు లేకుండా ఆ ఆటా, పాటా అలాగే రాత్రంతా సాగిపోతుంది...

**పండగన్న ఆలోచనకు శ్రీకారం ఇలా...**

వికాస సంస్థ గత కొన్నేళ్లుగా అక్కడి గిరిజనులతో కలిసి పనిచేస్తోంది. ప్రస్తుతం ఆ సంస్థ 'వాసన్' సహకారంతో 'వర్షాధార వ్యవసాయ పునరుజ్జీవం' అనే కార్యక్రమం అమలుచేస్తోంది. కార్యక్రమ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్న క్రమంలో భూ సారం సమస్య దాని పరిష్కార మార్గాలపై చర్చ జరిగింది.

ఈ గిరిజనులు ఎరువులు కానీ, పురుగు మందులు కానీ వాడరు... ఆయా అభివృద్ధి కార్యక్రమాల కింద ప్రభుత్వం నుంచి సబ్సిడీలపై ఎరువులు, మందులు పొందే అవకాశమున్నప్పటికీ వారు వాటి జోలికి పోలేదు.. ఎప్పటికప్పుడు వానలు పడడం వల్ల వాలు కలిగిన ఈ పల్లపు భూముల్లో పైపైన మందులు వాడితే లాభం లేదని వారంటారు... అంతేకాక ఏ ఏడాదికి ఆ ఏడాది ఎరువులు, పురుగుమందులు కొని వాడేంత ఆర్థిక స్థోమత వారికి లేదు... అందుకే వారు సహజ పద్ధతుల్లోనే భూమి బలం నిలపడానికి ప్రయత్నిస్తారు..

**పండగ జరుపుకున్న గ్రామాలు**

రంగిన వలస, గాల్లి, జామిగూడ, బిల్లాపుట్, బేజుమారవలస, ఆమలగూడ, దోడవలప, గోండిగూడ, గోడసర్ల, పాములరాయి

అంతో ఇంతో పశు సంపద ఉంటుంది కాబట్టి వాటి పేడనే ఎరువుగా వాడుతారు... కావలసినంత పేడను సమకూర్చి పెట్టుకుని దానినే గెత్తంగా పొలాల్లో చల్లుతారు. అయితే పశు సంపద తగ్గిపోవడం వల్ల గెత్తం వారికి పెద్ద సమస్యగా మారింది. అదే సమయంలో భూములు సారం కోల్పోవడం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో అక్కడి అడవి, కొండగుట్టల్లో పెరిగే బయోమాస్ ఆధారంగా వారు తమకు కావలసిన గెత్తం తయారుచేసుకోవచ్చనే ఆలోచనను సంస్థ వారి ముందుకు తీసుకువచ్చింది. ప్రాజెక్టు పరిధిలోని గూడెంలలో గిరిజనులు దానికి సానుకూలంగా స్పందించారు. అదే 'గోబర్ పరోబ్'గా రూపు తీసుకుంది...

గత మే నెలలో 20-30 తేదీల మధ్య 10రోజుల పాటు (రోజుకు ఒక గ్రామం వంతున 10 గ్రామాలలో) ఈ పండగ జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో దాదాపు 300 మంది గిరిజనులు పండగ పనుల్లో పాల్గొన్నారు. మొత్తం 120 ఎరువు గుంతలు తయారయ్యాయి. ఒక్కో గుంత నుంచి ఆరు నెలల్లో కనీసం టన్ను ఎరువు వస్తుందని అంచనా....



(మరిన్ని వివరాలకు **'వికాస'** సంస్థను సంప్రదించండి.
ఫోన్ : 08936 239133 లేదా 0891 2717309)







# 50 ఏళ్ళ ఆంధ్రప్రదేశ్




**భా**షా ప్రయుక్త రాష్ట్రాలలో మొట్టు మొదటిగా ఏర్పడింది ఆంధ్రప్రదేశ్. అది నవంబరు 1, 1956. రాష్ట్రం ఏర్పడి గత సంవత్సరం 50 ఏళ్ళు పూర్తి అయ్యాయి. ఆ సందర్భంగా సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చి & కమ్యూనికేషన్ Fifty years of Andhra Pradesh అన్న పుస్తకాన్ని ప్రచురించింది. ఎ4 సైజులలో 600 పైగా పేజీలున్న ఈ పుస్తకంలో వివిధ రంగాలలో నిపుణులైన వారు రాసిన 40కి పైగా వ్యాసాలున్నాయి. చరిత్ర, ప్రకృతి వనరులు, వ్యవసాయం, నీటి పారుదల, పరిశ్రమ, మౌలిక సదుపాయాలు, సేవల రంగం, ఆర్థిక అంశాల వంటి వాటిపై ఈ వ్యాసాలు ఉన్నాయి. రాష్ట్రం గురించి తెలుసుకోవాలనుకునే విద్యార్థులకు, పరిశోధకులకు, టీచర్లకు, విషయ నిపుణులకు, ప్రభుత్వ అధికారులకు, సామాజిక కార్యకర్తలకు, వ్యాపార వేత్తలకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రాష్ట్రం గురించి కీలకమైన గణాంకాలు తెలియ చేసే 40 దాకా అనుబంధాలు కూడా ఉన్నాయి. ఒక పుస్తకం వెల 750 రూపాయలు. ఒకటికి మించి కొన్నవారికి ధరలో కొంత రాయితీ ఉంది. పుస్తకాన్ని ఆర్డరు చెయ్యటానికి, మరిన్ని వివరాలకు సంప్రదించండి: సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చి & కమ్యూనికేషన్, మైత్రి రెసిడెన్సీ 3-6-394, వీధి నెం. 3, హిమయత్‌నగర్, హైదరాబాదు 500 029.

# సర్కారు తుమ్మ...

4వ పేజీ తరువాయి

తీయించేసి ఉపయోగపడే చెట్లను పెంచేలా చేయాలని పథకం కింద ఆలోచన చేశారు.

అయితే బయటి వారికి సమస్యగా కనపడింది, ఊరి వారికి సమాధానంగా కనపడింది. సర్కారు తుమ్మ ఎక్కువగా ఉండటంతో పది సంవత్సరాల క్రితం బయటి నుంచి వచ్చిన వారు స్థానిక ప్రజల సహాయంతో దానిని బొగ్గుగా మార్చసాగారు. క్రమేపీ స్థానిక ప్రజలు కూడా సర్కారు తుమ్మతో బొగ్గు తయారు చేయడం నేర్చుకున్నారు.



సర్కారు తుమ్మ నరకటం వల్ల కూలీ వారికి వ్యవసాయంలో కంటే 3-4 రెట్లు అధిక కూలీ లభిస్తోంది. భూమి ఉన్న రైతుకి మొత్తం ఆదాయంలో 10శాతం చెల్లిస్తున్నారు. పరిశ్రమలు, పట్టణ ప్రాంతాలలో సర్కారు తుమ్మ కలపకీ, బొగ్గుకీ గిరాకీ ఉండటంతో అంతా లాభసాటిగా ఉంది. 2006 సంవత్సరంలో కరువు వచ్చినప్పటికీ ప్రజలెవ్వరూ వలసకు వెళ్ళలేదు. సర్కారు తుమ్మ ద్వారా వచ్చే ఆదాయంతో సంతోషంగా ఉన్నారు.

వాతావరణంలో మార్పు వల్ల వచ్చే పరిణామాలను, మారిన పరిస్థితులకు అనుగుణంగా కొత్త జీవనోపాధులను వెతుకుతున్న స్థానిక ప్రజల విజ్ఞత, సామర్థ్యాలను సూచిస్తోంది. అంతే మొండిపై కొన్ని పండ్ల చెట్లను పెంచేలా చూడటానికి కార్యక్రమంలో భాగంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- ఎన్. సాయి భాస్కర్
కన్సల్‌టెంట్ వి&ఎ ప్రోగ్రాం, ఆక్స్‌ఫ్యామ్ యూనిట్, హైదరాబాదు
saibhaskarnakka@gmail.com

# సాగునీటి సంఘాలతో మార్పు

ప్రజల భాగస్వామ్యం ఉంటే ఏదైనా సాధించవచ్చు. ఈ ఉద్దేశంతో ప్రభుత్వం తన విధానాల్లో మార్పు తెస్తోంది. భాగస్వామ్య సాగునీటి యాజమాన్యం వీటిల్లో ఒకటి. దీని పరిణామాలు ఏమిటి, ఫలితాలు ఎలా ఉన్నాయి అన్న ఈ అంశంపై అహ్మదాబాదులోని డెవలప్‌మెంట్ సపోర్ట్ సెంటర్ ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలలో అధ్యయనం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ అధ్యయనానికి వాసన్ బాధ్యత వహిస్తోంది. కరీంనగర్, నల్లగొండ, కర్నూలు, శ్రీకాకుళం జిల్లాలలో నాలుగు సాగునీటి సంఘాలను అధ్యయనం చేసింది. ఎంపిక చేసిన సాగునీటి సంఘాలతో వివిధ పిఆర్ఏ పద్ధతుల ద్వారా బృంద చర్చలు నిర్వహించారు, సంఘాల బాధ్యులతో మాట్లాడారు. రైతుల వ్యక్తిగత కేస్‌స్టడీలు తీసుకున్నారు. ఈ అధ్యయనం ఈ దిగువ విషయాలను వెల్లడి చేసింది.

### పెరిగిన సాగునీటి విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకత

1997లో సాగునీటి సంఘాలు ఏర్పడిన తరువాత చెరువులకు, కాలవలకు మరమ్మతులు చేపట్టడం ద్వారా సాగునీటి విస్తీర్ణం పెరిగింది. ఉదాహరణకు కరీంనగర్ జిల్లా చెల్పూరు సాగునీటి సంఘం కింద ఆయకట్టు ప్రాంతం 1997లో 604.2 హెక్టార్ల నుంచి 2006లో 1283.4 హెక్టార్లకు పెరిగింది. నీటి యాజమాన్యంలో సామర్థ్యం వల్ల మొత్తం ఆయకట్టుకు నీరు అందసాగింది. "పొనుగోడు ఆయకట్టు 1063 హెక్టార్లు ఉంది. అయితే 800 హెక్టార్లకే సాగునీరు అంది, కాలవ చివర భూములు పడావుగా ఉండేవి. సాగునీటి సంఘం ఏర్పడిన తరువాత భూములన్నింటికి నీరు అందుతోంది" అంటున్నారు సాగునీటి సంఘం మాజీ ప్రెసిడెంట్ సత్యనారాయణ రెడ్డి. సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో సకాలంలో కాలవల మరమ్మతు, కాలవలపై నిఘా, వారబంది అమలు వంటి వాటివల్ల ఇది సాధ్యమయ్యింది.



### పంటల విధానం

బియ్యానికి ఉన్న వినియోగం, మార్కెటు మద్దతు కారణంగా నీరు ఉంటే వరి పంటకే ప్రాధాన్యతనిస్తున్నారు రైతులు. చెరువులు, కాలవల కింద ఆయకట్టు ప్రాంతాల్లో ఖరీఫ్, రబీ కాలాలలో వరి ప్రధాన పంటగా ఉండటం ఆశ్చర్యం కలిగించదు. వరి విస్తీర్ణం పెరగటంతో నీటి వినియోగం పెరిగి అంతిమంగా నీటి కొరత ఎదురయ్యే ప్రమాదమూ ఉంది.



తాళ్ళ వలస, చెలపూరు సాగునీటి సంఘాల కింద రబీలో పొగాకు, పొద్దు తిరుగుడు వంటి ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. అలాగా చాపిరేవల సాగునీటి సంఘంలో మిరప పంటను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు.

### ఆర్థిక ప్రయోజనం

సాగునీటి కింద విస్తీర్ణం పెరగటం వల్ల ప్రధానంగా రైతులు, కూలిపని దొరకడం వల్ల కూలీలు ప్రయోజనం పొందారని చెప్పవచ్చు. కొన్నిచోట్ల ఉత్పాదకత పెరగటం వల్ల కూడా రైతులు లాభపడ్డారు. మెరుగైన ఆదాయాల వల్ల గ్యాస్ పొయ్యిలు, టెలివిజన్లు, మోటారు సైకిళ్ళు, మొబైల్‌ఫోన్లు వంటివి విస్తరించాయి. వ్యవసాయ కూలీలు తమ పిల్లలను బడులకు పంపిస్తున్నారు. వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు వంటివి గణనీయంగా పెరిగాయి.

వివిధ ప్రభుత్వ శాఖల మద్దతు, సమన్వయం ఉంటే సాగునీటి సంఘాలు మరింత ఫలితాలను సాధిస్తాయి అనటంలో సందేహం లేదు.

*- సఫా, వాసన్*

# ఒరిస్సా జీవనోపాధుల కార్యక్రమానికి ప్రక్రియల మార్గదర్శక సూత్రాలు

ఒరిస్సా గిరిజన సాధికారీకరణ, జీవనోపాధుల కార్యక్రమం (ఒటిఇఎల్‌పి)తో కలసి వాసన్ సంస్థ అనేక బాధ్యతలు చేపట్టింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా వాటర్‌షెడ్ కార్యక్రమాలకు ప్రక్రియల మార్గదర్శక సూత్రాలు రూపొందించే బాధ్యత వాసన్‌కి ఒటిఇఎల్‌పి అప్పగించింది. ఇవి తుది రూపుదిద్దుకునే దశలో ఉన్నాయి. దానిలోని కీలకమైన అంశాలు తెలుసుకుందాం.

ఒరిస్సా వాటర్‌షెడ్ కార్యక్రమంలో ఈ ఏడు అంశాలను కీలకమైనవిగా గుర్తించారు: 1) ఆక్రమించుకున్న భూమిపై చట్టపరమైన హక్కు, 2) ఆహార భద్రతను పెంపొందించే అభివృద్ధి చర్యలు, 3) సుస్థిర భూ వినియోగ విధానాలు, 4) అభివృద్ధి ప్రక్రియపై ప్రజా ఆధారిత సంఘాల మరింత నియంత్రణ, 5) వేతన, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించటం, 6) కీలక మౌలిక సదుపాయ సౌకర్యాలను కల్పించటం, 7) కష్టాలలో ఉండే ప్రజలకు సామాజిక భద్రత. ఈ అంశాలకు సంబంధించి అనుసరించవలసిన విధానాలను, వ్యూహాలను ప్రక్రియల మార్గదర్శక సూత్రాలలో పొందుపరిచారు.

ఇదే రకంగా మార్గదర్శక సూత్రాలలో వ్యవస్థాపక అంశాలు, ఆర్థిక అంశాలు, ప్రాజెక్టు యాజమాన్య అంశాలకు సంబంధించి కీలక విధానాలను పేర్కొన్నారు.

### వ్యవస్థాగత అంశాలు

- వాటర్‌షెడ్ కమిటీతో పాటు గ్రామస్థాయి సబ్ కమిటీ ఏర్పాటు, వాటర్‌షెడ్ కమిటీ పరిపాలన సంబంధ అంశాలను చూస్తే, సబ్ కమిటీ పనుల అమలుకు బాధ్యత వహిస్తుంది.
- సామాజిక, ఆర్థిక తనిఖీలకు గ్రామస్థాయి, మైక్రో వాటర్‌షెడ్ స్థాయిలలో అదనపు సబ్ కమిటీ ఏర్పాటు
- మామూలుగా ఏర్పాటు చేసే బృందాలతో పాటు వన సంరక్షణ సమితి, ఉమ్మడి ప్రయోజన బృందాల ఏర్పాటు
- మైక్రో వాటర్‌షెడ్ స్థాయిలో స్వయం సహాయక బృందాల సమాఖ్య ఏర్పాటు

### ఆర్థిక అంశాలు

- నిధుల జారీలో వికేంద్రీకరణ (వాటర్‌షెడ్ కమిటీ నుంచి సబ్ కమిటీకి)
- ప్రజల వాటాను ముందుగా వసూలు చేయటం
- జీవనోపాధుల అభివృద్ధికి రివాల్వింగ్ నిధి
- గ్రామస్థాయి కార్యాచరణ ప్రణాళిక ద్వారా ఇతర పథకాల నుంచి నిధులను సమకూర్చుకోవటం
- ప్రజల వాటా వసూలు చేయటానికి ఖర్చు పంచుకునే విధానాన్ని అనుసరించటం
- పనికి ఆహారం ద్వారా సబ్సిడీ అందించి దానిద్వారా కార్పస్ నిధిని పెంపొందించుకోవటం
- సరికొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం కూలీలకు డబ్బులు చెల్లించటం, స్త్రీ, పురుషులకు సమాన కూలీ
- తరువాత వాయిదాల విడుదలకు ముందు జమాఖర్చు లెక్కలను సబ్ కమిటీ తనిఖీ చెయ్యటం

### ప్రాజెక్టు యాజమాన్య అంశాలు

- వివిధ అంశాలు, ఉప అంశాలను సరైన వరస క్రమంలో చేపట్టడం, ఆ ప్రకారం సామర్ధ్యం పెంపుదల సేవలు అందించటం
- ఈ క్రమంలో ఫలితాలను సాధించారో, లేదో సమీక్షించటం
- మరమ్మతులు, నిర్వహణకు వినియోగ రుసుం వసూలు చేయటం
- కార్యక్రమాన్ని మరింత సమర్థంగా అమలు చెయ్యటానికి పిఐఏ స్థాయిలో అదనంగా 2-3 డబ్ల్యుడిటి సభ్యులు, బ్లాక్ స్థాయిలో సర్వే బృందం, జిల్లా స్థాయిలో పిఎంయు, రాష్ట్రస్థాయిలో పిఎస్‌యుల ఏర్పాటు
- స్థానిక సాంకేతిక విజ్ఞానాన్ని (ITK) అనుసరించటానికి అధిక ప్రాధాన్యత
- పనుల అమలులో వినియోగదారులు/ స్వయం సహాయక బృందాలను భాగస్వాముల్ని చేయటం

# పెరటిలో పెంపకానికి కొత్త కోడి జాతి

అడవి కోళ్ళను మచ్చిక చేసి పెరటిలో పెంపకాన్ని చేపట్టాం. ఇవి గుడ్లు, మాంసమే కాకుండా గ్రామీణ కుటుంబాలకు కొంత ఆదాయాన్ని కూడా సమకూరుస్తాయి. షెడ్లలో వేలు, లక్షల్లో వాణిజ్య పరంగా కోళ్ళను పెంచుతున్న ప్రస్తుత పరిస్థితుల్లోనూ గ్రామీణ పేదల జీవితాల్లో పెరటి కోళ్ళ ప్రాముఖ్యత ఉంది. అయితే పెరటిలో పెరుగుతూ నాటు కోడి కంటే ఎక్కువ మాంసం, ఎక్కువ గుడ్లు ఇచ్చే జాతుల రూపకల్పనలో గిరిరాజా, వనరాజా జాతులను రూపొందించారు. ఇప్పుడు శ్రీ వెంకటేశ్వర పశు విశ్వ విద్యాలయానికి చెందిన లైవ్‌స్టాక్ రీసెర్చి యూనిట్ (ఎల్ఆర్ఐ) వారు కొత్త కోడి జాతిని పెంపొందించారు.

## కొత్త కోడి జాతి లక్షణాలు:

- చూడటానికి నాటుకోడి మాదిరిగా ఉంటుంది
- ఇది గుడ్లు పెట్టే రకం, సంవత్సరానికి 125-150 గుడ్లు పెడుతుంది
- 40 వారాలకి గుడ్డు బరువు 45 గ్రాములు ఉండి, 64 వారాలకు 50 గ్రాములకు చేరుకుంటుంది
- దీని పరిమాణం మధ్యస్తంగా ఉండి, కుక్కలు వంటి వాటి నుంచి తప్పించుకోటానికి ఎగరగలదు
- నాటుకోడి జన్యువులు ఉండటం వల్ల ముఖ్యమైన రోగాలను తట్టుకోగలదు
- అంతేకాకుండా చాలా తక్కువ మేతతో విపరీత వాతావరణ పరిస్థితులను తట్టుకోగలదు

## క్షేత్ర పరిశీలన, పైలెటింగ్:

ఎల్ఆర్ఐతో కలిపి వాసన్ ఈ కోడిజాతి పనితీరుని గ్రామాల్లో పరిశీలిస్తుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని బొంరాస్‌పేట, దౌలతాబాద్, కోస్గి మండలాల్లోని ఎంపిక చేసిన గ్రామాల్లో పైలట్ చేస్తున్నారు. మండల మహిళా సమాఖ్య, గ్రామ ఐక్య సంఘాలతో చర్చించి కోళ్ళ పెంపకందార్లను గుర్తిస్తారు. కోళ్ళ పెంపకంలో వీరికి అవగాహనా/ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. వాక్సిన్లు, మందులు ఇవ్వడంలో కూడా శిక్షణ ఇస్తారు. ఖర్చులో కొంత భాగం పంచుకునే పద్ధతిలో ప్లాస్టిక్ ఫీడర్లు, వాటరర్లు అందచేస్తారు. కోళ్ళ మేత తయారు చేసి బృందాల ద్వారా అమ్మకం చేపడతారు. గుడ్లు, మాంసం అమ్మకానికి మార్కెటుతో అనుసంధాన పరుస్తారు. కోళ్ళ పెంపకాన్ని పెద్ద ఎత్తులో చేపట్టే నాటికి 5000 కోడి పిల్లలను పొదిగే 3 యూనిట్లను తెరుస్తారు. ఈ యూనిట్‌ని వ్యాపార సరళిలో వ్యక్తులు/బృందాలు చేపడతాయి.

స్వయం సహాయక బృందాల ద్వారా పెరటిలో కోళ్ళ పెంపకం లాభసాటి వ్యాపకంగా రూపొందించటం ఈ పథకం ఉద్దేశం. దీనిద్వారా మహిళలకూ కొంత ఉపాధి దొరుకుతుంది, ఇంటికి పౌష్టికాహారం దొరుకుతుంది, ఆదాయాలు పెరుగుతాయి. అంతిమంగా నాటు కోడిగుడ్లు, మాంసానికి మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పడుతుంది.

**- కె. వనజ, వాసన్**

- త్రైమాసిక కార్యాచరణ ప్రణాళిక ఆధారంగా నిధుల విడుదల
- వార్షిక కార్యాచరణ ప్రణాళికలే కాకుండా ఏడేళ్ళ సమగ్ర ప్రణాళిక తయారీ, వాటికి వికేంద్రీకృత ఆమోద విధానం
- సామర్ధ్యం పెంపుదల, ప్రధాన అమలు, కన్సాలిడేషన్ అనే మూడు దశలలో వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని చేపట్టడం
- సామర్ధ్యం పెంపుదల దశ ముగుస్తుండగా స్వచ్ఛంద సంస్థ, ప్రజా సంఘాల అమలు స్థాయిని, వారి సంసిద్ధతను అంచనా వేయడం
- వివిధ పాత్రధారులు జవాబుదారీగా ఉండేలా అవగాహనా పత్రాలు రూపొందించటం

ఇవి కాక మార్గదర్శక సూత్రాలలో మిగిలిన అంశాలు కూడా ఉన్నాయి.

మరిన్ని వివరాలకు ఒటిఇఎల్‌పి డైరెక్టర్ డి. మొహంతిని సంప్రదించండి: dmohanty@mailcity.com, dmohanty@lycos.com;otelp_psu@rediffmail.com

**- డా॥ ఎన్. కె. సాంఘి,** *nksanghi@yahoo.com*



# ఉపాధి హామీ పథకం - గ్రామసంఘం ద్వారా ముందస్తు చెల్లింపులపై పైలట్

కూలి పనిపై ఆధారపడే వారికి కుటుంబానికి కనీసం వందరోజుల పని కల్పించడం ఉపాధి హామీ పథకం ఉద్దేశం. కనీస కూలీ, ఆడ, మగ వారికి సమాన కూలీ దీంట్లో కీలకమైన అంశాలు. చెల్లింపులలో పారదర్శకత ఉండేలా చూడటానికి పోస్టాఫీసు ద్వారా డబ్బులు ఇచ్చేలా ఏర్పాటు చేశారు.

చేసిన పనికి ఆలస్యం కాకుండా వారం వారం డబ్బులు అందుతుంటే పని చెయ్యటానికి కూలీలు ముందుకు వస్తారు. దీని కోసమని గ్రామసంఘం ద్వారా ప్రతీ వారం కూలి పనిలో కొంత మొత్తాన్ని (చేసిన పని విధానాలకు రూ. 60/- చొప్పున). కొలతలు తీసిన తరువాత మిగిలిన మొత్తంలో పోస్టాఫీసు ద్వారా చెల్లించే ప్రయత్నాన్ని పైలట్‌గా చేపట్టారు. గ్రామ సంఘం ద్వారా ముందస్తు చెల్లించేది ఆహార భద్రతకి తోడ్పడితే పోస్టాఫీసు ద్వారా చెల్లించేది పొదుపుగా ఉపయోగపడవచ్చు. పోస్టాఫీసుకి ఇస్తున్నట్లే కూలీలకు చెల్లించిన మొత్తంలో గ్రామసంఘానికి 2 శాతం సర్వీసు చార్జీ కింద ఇస్తారు. ఈ పైలట్‌ని మెదక్ జిల్లా, పుల్‌కల్ మండలంలో చేపట్టారు.

**ముందుగా చేపట్టిన చర్యలు:** సంబంధిత అధికారులతో చర్చించి వ్యూహాన్ని ఖరారు చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం ఒక మెమో జారీ చేసింది. సంబంధిత గ్రామసంఘం ఉప కమిటీకి, మండల సమాఖ్య ఇసికి, క్షేత్ర సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కూలీలకు అవగాహన కల్పించారు. గ్రామసంఘం ప్రత్యేకంగా సమావేశమై తీర్మానం చేసింది, మండల అభివృద్ధి అధికారితో ఒప్పంద పత్రంపై సంతకం చేసింది, ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచింది. మస్టర్‌రోల్, సాఫ్ట్‌వేర్‌లో తగు మార్పులు చేశారు. గ్రామసంఘానికి 75,000 రూపాయలు అడ్వాన్సుగా జారీ చేశారు.

**చెల్లింపుల విధానం:** గురువారం నాడు మస్టరు మూసి వేస్తారు. కూలీలకు పని చేసిన ప్రతి రోజుకి 60 రూపాయలు చొప్పున బ్యాంకు నుండి డబ్బు తీసుకువచ్చి గ్రామ సంఘంలోని ఇజిఎస్ ఉపకమిటీ శుక్రవారం నాడే చెల్లింపులు చేస్తుంది. ఈ మొత్తానికి యంపిడివో చెక్కు ద్వారా సోమవారం నాటికల్లా గ్రామసంఘానికి చెల్లించి మళ్ళీ శుక్రవారం నాడు చెల్లింపులకు సిద్ధంగా ఉంచుతారు. చేసిన పనికి కొలతలు తీసి ఆ ప్రక్రియను అనుసరించి ముందస్తు చెల్లించింది పోగా ఇంకా ఎంత రావాలో లెక్కగట్టి సోమవారం నాటికి ఇస్తారు.



**ఫలితాలు:** ఈ పనిని మొదట 13 గ్రామ పంచాయితీలతో మొదలు పెట్టి అయిదవ వారంలో 24కి విస్తరింప చేశారు. పనికి హాజరైన వారు మొదట 257 కాగా అయిదవ వారానికి 1373 మందికి పెరిగారు, అదేవిధంగా పని దినాలు 910 నుంచి 8298కి పెరిగాయి. మొదటి వారంలో 57,390 రూపాయలు చెల్లింపు జరగగా అయిదవ వారంలో 4,97,880 రూపాయలు చెల్లించారు.

దీనివల్ల కూలీలలో మంచి స్పందన వచ్చింది. ఈ పైలట్ నుంచి నేర్చుకోడానికి వివిధ జిల్లాల నుంచి అధికారులు, సిబ్బంది వస్తున్నారు. నిరుపేదలు కూడా ఇప్పుడు ఈ పనులకు వచ్చి ప్రయోజనం పొందుతున్నారు.

*(ఉపాధి హామీ సంఘం*

*సాంకేతిక మద్దతు బృందం ప్రజంటేషన్ ఆధారంగా)*

Book Post

To

**వాసన్**
12-13-452, వీధి నెంబరు 1, తార్నాక
సికింద్రాబాదు - 500017
ఫోన్: 040-27015295/27015296, 55284580
Email: wassan@eth.net, Website: www.wassan.org

for private circulation only